

# పొంగల్ దంగల్

**సంక్రాంతి వచ్చిందంటే పల్లె మురుస్తుంది. పెద్ద పండుగకు పట్నమూ సంబురపడుతుంది. పల్లె అల్లరి కన్నా, పట్నం ఆనందం కన్నా.. మిన్నగా ఖుషీ అయ్యేది మాత్రం సినీ జనమే! అన్ని సీజన్లలో సంక్రాంతి ఈజ్ ద బెస్ట్ అని భావిస్తారు. పెద్ద హీరోలు, యువ హీరోలు అందరికీ ఈ పండుగ సెంటిమెంటే! అందుకే, విడుదలకు రెడీగా ఉన్నా... ఉత్తరాయణ పుణ్యకాలం కోసం నెలలు వేచి ఉంటారు దర్శక నిర్మాతలు. ప్రేక్షకులు సకుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చేలా పసందైన కథతో పొంగల్ దంగల్‌కు సిద్ధమవుతారు. పందెం కోళ్లు కాలు దువ్వినట్టు... సంక్రాంతి బరిలో నలుగురైదుగురు హీరోలు కాలర్ ఎగరేస్తుంటారు. ఆయా సినిమాలు హిట్టో, ఫట్టో తేలేలోపు.. బాక్సాఫీస్ రికార్డులు బద్దలైపోవడమే సంక్రాంతి స్పెషల్. ఇప్పుడు కూడా నాలుగు పెద్ద సినిమాలు సంక్రాంతి సంధిలో సందడి చేస్తున్నాయి. ఆ చిత్రాల సంగతులు ఇవి..**

ఏటా సంక్రాంతి సీజన్‌లో భారీ బడ్జెట్ సినిమాలు ప్రేక్షకులను పలకరిస్తాయి. గతేడాది పొంగల్ ఫెస్ట్‌లో ఐదు సినిమాలు రోజుల వ్యవధిలో విడుదల అయ్యాయి. చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ హీరోగా చేసిన 'వీరసింహారెడ్డి', అజిత్ 'తెగింపు', విజయ్ 'వారసుడు', సంతోష్ శోభన్ 'కళ్యాణం కమనీయం' సినిమాలు బాక్సాఫీస్ దగ్గర అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. వసూళ్ల పరంగా దాదాపు అన్నీ విజయం సాధించాయని చెప్పొచ్చు. ముఖ్యంగా వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి పోటాపోటీగా వసూళ్లు రాబట్టాయి. సంక్రాంతి బరిలో ఇద్దరు పెద్ద హీరోలు నిలవడంతో 2023 సంక్రాంతి సీజన్ ఇండస్ట్రీకి కొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఈ పండుగకు ఆ బాధ్యతను మరో ఇద్దరు అగ్రహీరోలు నాగార్జున, వెంకటేశ్ భుజానికెత్తుకున్నారు. వీరికి మహేష్‌బాబు కూడా జతకలవడంతో ఈ సంక్రాంతి సినిమాలకు కొత్త కళ వచ్చినట్టయింది.

### జై హను-మాన్..

ఈ సంక్రాంతికి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న చిత్రం 'హను-మాన్'. యంగ్ హీరో తేజ సజ్జా కథానాయకుడిగా రూపొందిన ఈ సెమీ ఫాంటసీ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని చాలా రోజులైంది. రకరకాల కారణాలతో విడుదల వాయిదా పడింది. ఎట్టకేలకు సంక్రాంతి ఫెస్ట్‌లో ఫస్ట్ హిట్ టాక్ సొంతం చేసుకున్న సినిమాగా పేరు తెచ్చుకుంది. తేజ సజ్జా, అమృత అయ్యర్, వరలక్ష్మి శరత్ కుమార్ తదితరులు నటించిన 'హను-మాన్'కు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించాడు. అతీంద్రియ శక్తులతో లోకాన్ని జయించాలనుకునే ప్రతినాయకుణ్ని హనుమంతుడి అనుగ్రహం పొందిన హీరో ఎలా ఎదుర్కొన్నాడన్నది కథ. కథనం కూడా ఆసక్తికరంగా మలచడం, గ్రాఫిక్స్ జతకలవడంతో మొదటి ఆటతోనే 'హను-మాన్'కు ప్రేక్షకులు జై కొట్టారు. హనుమంతుడి సెంటిమెంట్ బలంగా వర్కవుట్ కావడంతో సంక్రాంతి రేసులో తేజ భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడని ఇండస్ట్రీ టాక్.

### ఘాటు తక్కువైనా..

మహేశ్‌బాబు సినిమా అంటేనే ప్రేక్షకులకు ఒక ఊపొస్తుంది. ఆయనకు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ తోడవ్వడంతో అంచనాలు పదింతలు పెరిగాయి. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'ఖలేజా' వసూళ్ల పరంగా నిరాశ పరిచినా.. డిఫరెంట్ మహేశ్‌ను చూశామని అభిమానులు పండుగ చేసుకున్నారు. మళ్లీ వీరిద్దరూ జత కట్టడంతో 'గుంటూరు కారం' ఘాటు నషాళానికి ఎక్కుతుందని ఆశించారు.

మహేశ్ సరసన శ్రీలీల, మీనాక్షి చౌదరి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. జగపతిబాబు, రమ్యకృష్ణ, జయరాం, ప్రకాశ్‌రాజ్, రావు రమేశ్, ఈశ్వరీ రావు ఇలా భారీ తారాగణంతో మ్యాజిక్ జరుగుతుందని భావించారు. అందుకు తగ్గట్టుగా సినిమా చూశాక మహేశ్ మేనరిజమ్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయమంటున్నారు. రివ్యూలు ఎలా ఉన్నా... పండుగ వేళ సకినాల్లాంటి త్రివిక్రమ్ పంచ్‌లు, అరిసెల్లాంటి తియ్యని పాటలు వెరసి 'గుంటూరు కారం'పై మమకారం పెంచేలా చేస్తున్నాయి. ఓ పక్క సోషల్ మీడియాలో యావరేజ్ రివ్యూలు వైరల్ అవుతున్నా... మరోవైపు టికెట్లు తెగ అమ్ముడవుతున్నాయి.

### నా సామి'రంగం'లోకి సోగ్గాడు..

సంక్రాంతి సీజన్‌లో నాగార్జున సినిమాలు పెద్ద సంఖ్యలో రాకపోయినా.. వచ్చిందంటే బొమ్మ హిట్టవ్వడం ఖాయం. కెరీర్ మొదట్లో వచ్చిన 'మజ్ను' నాగ్ కెరీర్‌కు బూస్ట్ ఇచ్చింది. ఈవీవీ, నాగార్జున కాంబినేషన్‌లో వచ్చిన 'ఆవిడ మా ఆవిడే' కూడా సంక్రాంతి బొమ్మే! 2016లో వచ్చిన 'సోగ్గాడే చిన్నినాయన' రికార్డు కలెక్షన్లు రాబట్టింది. తర్వాత ఆరేండ్లకు 2022 సంక్రాంతి సీజన్‌లో కొడుకు నాగ చైతన్యతో కలిసి 'బంగార్రాజు'గా పలకరించి మరోసారి సంక్రాంతికి వచ్చానంటే హిట్టు పక్కా అని నిరూపించుకున్నాడు. ఏడాది గ్యాప్ తర్వాత ఈ సంక్రాంతికి అల్లరి నరేశ్, రాజ్ తరుణ్‌తో కలిసి అల్లరి చేయడానికి నాగార్జున సిద్ధమవుతున్నాడు. విజయ్ బిన్ని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇవాళే విడుదల కానుంది. స్నేహం, ప్రేమ, ద్వేషం ఇలా మానవ భావోద్వేగాలను మిళితం చేసిన 'నా సామిరంగ' పండుగ వేళ విందు భోజనం చేసిన అనుభూతి కలిగిస్తుందని చిత్ర యూనిట్ చెబుతున్నది. కీరవాణి మ్యూజిక్ సినిమాకు ప్లస్ అయింది.

### ఎనీ సంక్రాంతి.. విక్టరీ

విక్టరీ వెంకటేశ్, సంక్రాంతిది విడదీయరాని బంధం. ఆయన కెరీర్‌లో దాదాపు డజన్ చిత్రాల వరకు పొంగల్‌కు సందడి చేశాయి. 1989 సంక్రాంతికి విడుదలైన 'ప్రేమ' బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. వెంకటేశ్ సినీయానంలో మైలురాళ్లుగా చెప్పుకోదగ్గ సినిమాలు రక్త తిలకం, చంటి, ధర్మచక్రం, కలిసుందాం.. రా!, లక్ష్మీ, నమో వెంకటేశ, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, గోపాల గోపాల, ఎఫ్2 ఈ సినిమాలన్నీ సంక్రాంతికి విడుదలై రికార్డు వసూళ్లు సాధించినవే! పోకిరి రాజా, చిన్నబ్బాయి చిత్రాలు సంక్రాంతికే విడుదలైనా ఫ్లాప్ టాక్ తెచ్చుకున్నాయి. మొత్తంగా సంక్రాంతి సీజన్ వెంకటేశ్‌కు కలిసొచ్చేదే అనిపించుకుంది. అందుకే తన కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 75వ సినిమా విడుదలకు సంక్రాంతినే ఎంచుకున్నాడు అనిపిస్తుంది. 'సైంధవ్'గా పలకరిస్తున్నాడు ఆయన. శైలేశ్ కొలను దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమా మొదటి ఆట నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. యాక్షన్‌తో పాటు సెంటిమెంట్ కూడా బాగా వర్కవుట్ కావడంతో ఈ సంక్రాంతికి వెంకీ విక్టరీ పక్కా అనిపిస్తుంది.




# నో కండిషన్స్ అప్లై



**సూర్యుడు** మకరరాశిలోకి ప్రవేశించే వేళ... దేశమంతా సంక్రాంతి హేల కనిపిస్తుంది. పతంగులతో పిల్లలు, పిండివంటలతో పెద్దలు బిజీబిజీగా గడిపేస్తుంటారు. సంక్రాంతిని తాము లోహ్రీగా చేసుకుంటామని చెబుతున్నది పంజాబీ ముద్దుగుమ్మ హన్సికా మోత్వానీ. పంటలు చేతికొచ్చి తమ రాష్ట్రంలోని పల్లెలన్నీ ధాన్యలక్ష్మితో తులతూగుతూ ఉంటాయని చెప్పుకొచ్చింది. 'ఆ రోజు మేం ఉదయాన్నే లేచి గురుద్వారాకు వెళ్తాం. ఇంట్లో అంతా సందడిగా ఉంటుంది. ఆటపాటలతో రోజంతా సంతోషంగా సాగిపోతుంది. పిల్లల ఆటలు కొనసాగుతుండగానే.. పెద్దలు రకరకాల వంటకాలు చేస్తారు. లోహ్రీ సందర్భంగా కొన్ని సంప్రదాయ వంటకాలు, తీపి పదార్థాలు చేస్తారు. అవన్నీ సిద్ధమయ్యాక మధ్యాహ్నం అందరం కలిసి ఘనమైన విందు భోజనం చేస్తాం. నాకు స్వీట్ అంటే పెద్దగా ఇష్టం ఉండదు. కానీ, పండుగకు మాత్రం స్వీట్ల విషయంలో షరతులు పెట్టుకోను. చిక్కీ, నువ్వుల లడ్డూలు ఇష్టంగా తింటా' అని సంక్రాంతి కబుర్లు చెప్పుకొచ్చింది హన్సిక.

# పిల్లలకు భోగి భాగ్యాలు

సంక్రాంతి సందడి భోగితోనే మొదలవుతుంది. భోగి సందర్భంగా ఆనాడు సాయంత్రం చిన్నపిల్లలకు భోగిపండ్లు పోసే సంప్రదాయం ఉంది. రేగు పండ్లను తల మీద పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోయి నారాయణుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని ఒక నమ్మకం. రేగుపండ్లు, చెరకుగడలు, బంతి పూల రెక్కలు, చిల్లర నాణేలను భోగి పండ్లుగా వాడతారు. రేగు పండ్లకు బదరీఫలాలని పేరు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరికా వనంలో తపస్సు చేస్తుండగా, వారి తలల మీద దేవతలు బదరీ ఫలాలను కురిపించారట. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పండ్లను పోసే సంప్రదాయం ఏర్పడిందని చెబుతారు. ఎరుపు రంగులో ఉండే రేగు పండ్లను సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు. అలా ఆదిత్యుడి ఆశీస్సులు పిల్లలకు లభిస్తాయని భోగిపండ్లు పోస్తారు. పెద్ద పండుగకు ముందురోజు వచ్చే భోగి వ్యవసాయదారులకు ప్రధానం. సంక్రాంతి వేళ పంటలు చేతికొచ్చి.. పల్లెలు ధనధాన్యరాశులతో తులతూగుతూ ఉంటాయి. గతంలో అనుభవించిన కష్టాలకు ముగింపు పలుకుతూ 'భోగి'తో భోగభాగ్యాలు తమ జీవితంలో ప్రసరించాలని రైతులు భావిస్తారు. దీనికి ప్రతీకగా ఇన్నాళ్లూ తమను పట్టి పీడించిన దారిద్ర్యాన్ని తరిమికొడుతూ, కష్టాలన్నిటినీ అగ్నిలో ఆహుతి చేస్తూ భోగిమంటలను వేయడం ఆచారంగా మారింది. ఈ మంటల వెనుక ఆరోగ్యానికి సంబంధించిన శాస్త్రీయ కోణమూ దాగి ఉంది. దక్షిణాయనంలో అధిక భాగం అనారోగ్యం కలిగించే వాతావరణం ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో శ్వాస సంబంధమైన రోగాలు వ్యాపిస్తుంటాయి. వాటి నివారణ కోసం ఆవుపేడతో చేసిన పిడకలు, మామిడి, మేడిచెట్ల కొమ్మలతో భోగిమంటలు వేస్తారు. అందులో ఆవునెయ్యి వేస్తారు. భోగిమంటలు వెచ్చదనాన్ని ఇవ్వడంతో పాటు అందులోంచి వెలువడే శక్తి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. అందుకే భోగిమంటలకు అంత ప్రాధాన్యం ఏర్పడింది.



... శ్రీ

# రొటీన్‌గా ఉంటేనే ఇష్టం

**అందరూ అనుకున్నట్టు రొటీన్‌కు భిన్నంగా ఉండటం తనకు నచ్చదు అంటున్నది బాలీవుడ్ భామ సోనమ్ కపూర్. డే టు డే లైఫ్ సాదాసీదాగా సాగిపోతేనే సహజంగా ఉంటుందని చెప్పుకొచ్చింది. తన రొటీన్ దినచర్య గురించి ఇలా పంచుకుంది..**



- ఏ రోజూ భిన్నంగా ఉండదు. మనం ప్రశాంతంగా ఉంటే.. ప్రతి ఉదయం హృదయాన్ని స్పందింపజేసేదే అవుతుంది. ఫ్రెష్‌గా నిద్రలేచి రెగ్యులర్ వర్కవుట్లు చేస్తాను. తర్వాత పోషకాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటా.
- **సౌందర్య** సాధన చాలా అవసరం. ముఖ్యంగా గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్నప్పుడు అది తప్పనిసరి. ఆహార నియమాలు పక్కాగా పాటించాలి. కేశ సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తా. యాంటీ హెయిర్ ఫాల్ సీరమ్ రెగ్యులర్‌గా అప్లై చేస్తుంటా.
- **వాతావరణ** కాలుష్యం, పని ఒత్తిడి ఇవన్నీ శారీరక ఆరోగ్యానికి భంగం కలిగిస్తుంటాయి. ముఖ్యంగా హెయిర్‌లాస్‌కు ఇవి ప్రధాన కారణం అవుతాయని నిపుణులు చెబుతుంటారు. వెంట్రుకల కుదుళ్లు బలంగా ఉండేందుకు పోషకాహారం చాలా అవసరం. అందుకే నా డైట్ ప్రత్యేకంగా ఉంటుంది. రుచుల కన్నా.. పోషకాలకే అధిక ప్రాధాన్యం ఇస్తా. అలాగని నోరేం కట్టుకోను.. రుచికరమైన పదార్థాలనూ ఆస్వాదిస్తా!

# డబుల్ ట్రబుల్



ఓటీటీ హిట్

## కిల్లర్ సూప్

**నెట్‌ఫ్లిక్స్:** జనవరి 11
**నటీనటులు:** మనోజ్ బాజ్‌పాయ్, కొంకణాసేన్ శర్మ, నాజర్, సయాజీ శిండే తదితరులు
**దర్శకత్వం:** అభిషేక్ చౌబే

**'ఫ్యామిలీ** మ్యాన్' వెబ్‌సిరీస్‌ల తర్వాత మనోజ్ బాజ్‌పాయ్ ఏ పాత్ర పోషించినా ప్రేక్షకులు విపరీతంగా ఆదరిస్తున్నారు. అది సినిమా అయినా, వెబ్ సిరీస్ అయినా.. ఆయన మంచి కథనే ఎంచుకుంటారనీ, తన పాత్రను అత్యద్భుతంగా పండిస్తాడని ఎదురుచూస్తున్నారు. ఇక, మనోజ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడని తెలిస్తే.. ఇంకెలా ఉంటుందో ఊహించుకోండి. 'కిల్లర్ సూప్' మీద అంచనాలు భారీగా పెరగడానికి మనోజ్ డబుల్ రోల్ చేయడమే ప్రధాన కారణం. కథలోకి వెళ్తే... ప్రభాకర్ శెట్టి అలియాస్ ప్రభు (మనోజ్ బాజ్‌పాయ్), స్వాతి (కొంకణాసేన్ శర్మ) దంపతులు. ఇద్దరి అభిప్రాయాల మధ్య కొండంత దూరం ఉంటుంది. స్వాతి సొంతంగా రెస్టారెంట్ పెట్టాలని అనుకుంటుంది. ప్రభు పక్కా అవినీతి పరుడు. వ్యాపారవేత్తగా ఎదగాలని తప్పుడు మార్గాలు ఎంచుకుంటూ ఉంటాడు. ప్రభు తన అన్న అరవింద శెట్టి (సయాజీ శిండే)తో కలిసి కొన్ని వ్యాపారాలు చేస్తాడు. అవన్నీ బెడిసికొట్టడంతో నష్టపోతాడు. ఇక లాభం లేదనుకొని అన్న సాయంతోనే ఓ రిసార్టు ప్రారంభించాలని భావిస్తాడు. కానీ, అదీ వర్కవుట్ కాదు. మరోవైపు ఓ మసాజ్ చేసే వ్యక్తి ఉమేశ్ అచ్చం ప్రభులాగే ఉంటాడు. తరచూ ప్రభుకు మసాజ్ చేస్తుంటాడు. అతనితో స్వాతికి అనుబంధం ఏర్పడుతుంది. ఇద్దరి మధ్య వివాహేతర బంధం కొనసాగుతుంటుంది. ఈ క్రమంలో ప్రభు హత్యకు గురవుతాడు. ఇదే అదనుగా ప్రభు స్థానంలోకి ఉమేశ్‌ను తీసుకొస్తుంది స్వాతి. ఆ తర్వాత జరిగిన పరిణామాలేంటి? ప్రభును చంపిందెవరు? ఆ హత్యకు స్వాతికి ఏమైనా సంబంధం ఉందా? ఈ కేసును పోలీసులు ఎలా ఛేదించారన్నది మిగిలిన కథ. శృంగార సన్నివేశాలు మోతాదులోనే ఉన్నప్పటికీ.. అసభ్య సంభాషణలు చికాకు పుట్టిస్తాయి. కుటుంబ సమేతంగా చూడటం కష్టమే! మొత్తంగా మనోజ్ బాజ్‌పాయ్ నటన ఈ కామెడీ థ్రిల్లర్‌ను ప్రేక్షకులు చూసేలా చేస్తుంది.